తొడిగే హక్కు వుంది అన్నట్టు. అడుక్కున్నవాడు ఇంగ్లీషు మాటాడుతున్నాడనుకోండి. మీరెలా అయిపోతారో వూహించుకోండి.

విమానం కూడా దొరలు కనిపెట్టిందే. మరి విమానంలో ఇంగ్లీషు మాటాడకుండా ఒకసారి తెలుగు మాటాడి చూడండి. మనల్ని గజ్జికుక్కల్ని చూసినట్టు చూస్తారు. మనకి చదువు లేదన్నట్టే చూస్తారు.

చదువుకీ తెలివికీ సంబంధం లేదంటారు. మరి సంస్కృతాంధ్ర భాషలు క్షుణ్ణంగా తెలిసిన మహా పండితుడు,

పంచతో పిలకతో,

బూట్లుతో విమానమెక్కి చూడమనండి. అది భారతీయ సంస్కృతి అని వేదికలెక్కి వుపన్యాసాలిచ్చే మనవాళ్లే పుసుక్కున నవ్వుతారు.

మరి గాంధీగారు ఇంకా ఘోరంగా, ఆ పంచతో ఇంగ్లాండ్ రౌండ్‌టేబిల్ కాన్ఫరెన్స్‌కి వెళ్ళారు. అప్పుడు ఛర్చిల్ గాంధీగార్ని "నేకెడ్ ఫకీర్" అన్న మనం నొచ్చుకోరాదు. ఎందుకు? అప్పుడు జాతీయాభిమానం అలాంటిది? మొట్టమొదటి కామన్‌వెల్త్ కాన్‌ఫెరెన్స్‌కి మన ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూగారు వెళ్ళినపుడు గాంధీ టోపీనీ, షెర్వానీ, పైజమా వేసుకోలేదు. సూట్ వేసుకున్నారు. అదీ సూట్ ప్లస్ ఇంగ్లీషు అధికారం.

ఆ అధికారం తమకి పోతుందనే భయంతో ఈ వాళ హైద్రాబాద్‌లో చాలా మంది అల్ప సంఖ్యాక వర్గాలు హైద్రాబాద్‌లో ఉర్దూనే కావాలని మాటాడుతున్నారు. మరి తెలుగువాడికేం దరిద్రమట హైద్రాబాద్‌లో తెలుగే మాటాడడు? అంటే తెలుగుని దరిద్రగొట్టు, బానిస భాషలోకి నెట్టేసిన మన తెలుగు నాయకమన్యుల్ని అనాలి.

మొన్న ఢిల్లీలో ప్రకాశం పంతులు గారి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించినపుడు ఆ సభకి అందరూ తెలుగు వాళ్లే విచ్చేశారట. కాని ప్రధాన మంత్రి గారితో బాటు ఒక్కళ్లైనా కూడా తెలుగు మాట్లాడలేదట.

ఎంత సిగ్గు చేటు? ఆహా తెలుగు తల్లీ ఇంకా నువ్వు ఆత్మహత్య చేసుకోకుండా ఎందుకమ్మ సెక్రెటేరియట్ పక్కన శిలలా నిలబడి మూగ సాక్షిలా బతుకుతున్నావ్!

మినీకథ

# బాబోయ్ ... రచైత

నందిని తిమ్మివేసైనా, తిమ్మిని నందివేసైనా 'రచైత' కావాలన్న కోరిక మైండులో మెండై కూర్చుంది నాకు.

'మరి రచైత కావడమంటే అరటిపండు తిన్నంత సులభమా'

కాదుగా మరి. ఏదో ఒకటి రాయాలి. రాయాలంటే మూడ్ రావాలి. రావాలంటే ముందు మైండ్ ఫ్రెష్ కావాలి. ఆ... మరిచేపోయాను ఆ మధ్యవెడో రచైత సిగరెట్టు మీద సిగరెట్టు కాల్చేస్తూ గొప్ప రచైత(అ)యిపోయానన్నాడు.



వెంటనే దుఖానం కేసి పరుగుతీసి మంచి సిగరెట్టు పొకదాన్ని అంటించాను. పొగను గుండెల్నిండా పీల్చి గాల్లోకి వదుల్తూ ఆలోచిస్తున్నాను. "ఊహూ... ఆలోచన లేదు పాల్లేదు. తల్లో వెంట్రుకల్ని ఒక్కొక్కటినే పీకి అవతల పారేస్తూ కూర్చున్నా... ఆ... వచ్చింది... బ్రహ్మాండమైన ఆలోచన... సింప్లీ సూపర్బ్ అయిడియా.

గంటన్నర సేపు పేపర్ తీసుకుని పెన్నులోని ఇంకంతా అయిపోగొట్టాను. అయినా కథ ఇంకా అయిపోలా. అయిపోతుందా మరి. అయిపోవాలంటే కథకు ముగింపుండాలిగా... నా కథకు ముగింపు అందరి రచైతల్లా ఉండకూడదంటే ఉండకూడదు. ఈ ఒక్క కథతోనే నేనో గొప్ప రచైతయిపోవాలి. నేనో గొప్ప రచైతనయి రాసేరాసే చచ్చిపోయాక గొప్ప గొప్ప రచైతలందరూ వరుసలో నా పటానికి దండలేస్తున్నట్లుగా కల... బాబోయ్ నిజంగా అయిపోతానో ఏమో. ఎట్టకేలకు కథ ముగింపు కోసం దొరికిన పేపరువల్లా చించి, పెన్నులు మార్చి మార్చి కథను 'సమాప్తం' వరకూ లాగిపడేసాను. అంతటితోనే రచైతనయిపోతానా... భలేవారండీ మీరు కథను పత్రిక్కి పంపాలిగా... పంపితే అది పత్రికల్లో ప్రింటవ్వాలిగా.

ఓ మాంచి తిథి, నక్షత్రాలు గట్రా చూసి కథను పోస్ట్‌బాక్స్‌లో పడేసి పోస్ట్‌మాన్ వచ్చి వాటిని తీసేంతవరకూ నిబ్బరంగా నిక్కనీల్గి కాల్లీడ్చుకుంటూ ఇల్లుచేరాను. అప్పటి నుంచి ఒకటే బెంగ... చుట్టుపక్కల ఇల్లలోని అమ్మలక్కలూ, అన్నతమ్ముల్లకూ అందరికీ నా పనితనం తెలిసేలా దండోరాతో పాటుగా భాజాభజంత్రీ వాయించి వచ్చింది నా శ్రీమతి. ఈ విషయం అది కాస్త నాకు చెప్పినప్పటి నుంచి గుండె గుండెలో లేకుండా వుంది.

మూన్నెల్ల వనవాసం పూర్తయింది. ఒక రోజు గోదార్లో స్నానం చేసి సాయంత్రానికి ఇంటికి వెళ్తాంటే దారిలో పోస్టబ్బాయి కన్పించి రామశాస్త్రి నీకో ఉత్తరం వచ్చిందంటే జారిపోతున్న గుండెకాయని చేత్తోపట్టుకుని ఒకటే పరుగు... ఇంట్లోకి వెళ్ళి చూస్తే నేను కథను పంపిన పత్రిక ప్రతితో పాటుగా ఓ ఉత్తరం— గబగబా చదివాను.

'మీ కథ చదివింతర్వాత ప్రచురణకు ఎంపిక చేశాము. కాకపోతే మీ కథ పూర్వం నాటి ఒక రచైత కథకు అనుకరణగా భావించి మా పత్రికలో రచయిత పేరు లేకుండా వేసే 'అనగనగా ఒక ఛండాలం కథ' క్రింద మీ కథను వేస్తున్నాము. అన్న దాన్ని చూసి గొప్ప రచైతకు వ్యతిరేకంగా ఛండాలం రచైతగా పేరొచ్చిందని పొట్టచెక్కలయ్యేలా నవ్వుతూ నా శ్రీమతి ఎగిరి గంతేస్తూ చుట్టుప్రక్కలోల్లకి భాజాభజంత్రీ నాయిస్తుంటే గోదార్లో మరోసారి దూకటానికి పరుగెత్తాను. మరింకేం చేయను.

నవ్వుకోవటానికి మాత్రమేనని మనవి.

— సాహితీ చైతన్య